అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్ : పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, మే 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలోని అనంతారం గ్రామ ఉన్నత పాఠశాలలో తాగునీటి వసతి, టైల్స్, టాయిలెట్స్, ఎలక్ట్రికల్ పనులతోపాటు మౌలిక వసతుల పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో పనులకు రూ.3.30 లక్షలు అంచనా వేయగా.. మొదటి విడుతలో 25శాతం నిధులు విడుదల కాగా, పనులు జరుగుతున్నాయన్నారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగరాజన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పొట్ట లావణ్య, పంచాయతీ సెక్రటరీ నర్సింగ్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీబీనగర్‌లో పనుల పరిశీలన

బీబీనగర్ : అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలలో చేపట్టిన పనులను జడ్పీ సీఈఓ శోభారాణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10లోపు పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాలో 73.15 శాతం పోలింగ్

- ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్
- ఓటు హక్కును వినియోగించుకున్న 37,669 మంది పట్టభద్రులు
- బ్యాలెట్ బాక్స్‌లు నల్లగొండకు తరలింపు

పెన్‌పహాడ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు దీరిన పట్టభద్రులు

కోదాడలో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

సూర్యాపేట, మే 27 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పట్టభద్రులు పెద్ద ఎత్తున్న పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూర్యాపేట జిల్లాలో 73.15 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో 51,497 మంది ఓటర్లు ఉండగా 37,669 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 25,447, మహిళలు 12,222 మంది ఉన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 5,828 మంది ఓటు వేయగా 11.32 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటల వరకు 31.27 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 52.8 శాతం, సాయంత్రం 4 గంటల వరకు 70.62 శాతం నమోదు కాగా ముగిసే వరకు 73.15 శాతంగా నమోదైంది.

నల్లగొండకు బ్యాలెట్ బాక్స్‌లు

పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను రాజకీయ పార్టీల ఏజంట్ల సమక్షంలో సీజ్ చేశారు. పీఓ, ఏపీఓ, సెక్టార్ ఆఫీసర్ ఆధ్వర్యంలో రూట్ల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను సూర్యాపేట కలెక్టరేట్‌కు తరలించారు. అన్ని బ్యాలెట్ బాక్స్‌లను స్వీకరించిన అనంతరం ప్రత్యేక వాహనంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి గోదాంకు తరలించారు.

ఓటు వేసిన ప్రముఖులు

సూర్యాపేట, మే 27 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లు పెద్ద ఎత్తున్న ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉదయం 8 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 457 పోలింగ్ బూత్‌లో తొలి ఓటు వేశారు. కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోదాడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తన సతీమణి కమలతో కలిసి తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 449 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సుధీర్‌రెడ్డి ఓటు వేశారు. తుంగతుర్తి జడ్పీ హైస్కూల్ లో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికా యుగంధర్‌రావు దంపతులు, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి అనితాసైదులు, ఎంపీపీ కవితా రాములుగౌడ్ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటింగ్ సరళి పరిశీలన

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో ఎన్నికల ఓటింగ్ సరళిని కలెక్టర్ ఎస్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నామని, ఎన్నికల సరళిని ప్రత్యక్షంగా పరిశీలించినట్లు ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ సురేశ్‌కుమార్, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ఉన్నారు.

సూర్యాపేట : కలెక్టరేట్‌లోని రిసెప్షన్ కేంద్రానికి బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

పాలకవీడు : మండల కేంద్రంలో ఓటేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న పట్టభద్రులు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం వివరాలు

మండలాలు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
నేరేడుచర్ల	2,290	1713	74.4
పాలకవీడు	879	659	74.97
మఠంపల్లి	1,837	958	70.76
మేళ్లచెర్వు	1,334	947	70.98
చింతలపాలెం	791	598	75.60
హుజూర్‌నగర్	3,448	2601	75.43
గరిడేపల్లి	2,581	1920	74.39
మొత్తం	13,160	9737	73.99

వివిధ మండలాల్లో నమోదైన పోలింగ్

పెన్‌పహాడ్ మండలంలో 73.79శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2034 ఓట్లు ఉండగా 1501 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆత్మకూర్.ఎస్ మండలంలో 73.17శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2023 ఓట్లు ఉండగా 1417 ఓట్లు పోలయ్యాయి. చివ్వెంల మండలంలో మొత్తం 2522 ఓట్లు ఉండగా 1830 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తాసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. చిలుకూరు మండలంలో మొత్తం 2,207 ఓటర్లు ఉండగా 1622 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 73.49 శాతం పోలింగ్ నమోదైంది. పాలకవీడు మండలంలో 879 మంది పట్టభద్రులకు గాను 659 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 74.97 శాతం ఓటింగ్ నమోదైంది. మోతె మండలంలో మొత్తం 1543 ఓట్లు ఉండగా, 1097 మంది ఓటేశారు. 70 శాతం ఓటింగ్ నమోదైంది. నాగారం మండలంలో మొత్తం 74శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల పీఓ అంజయ్య తెలిపారు. మద్దిరాల మండలంలో మొత్తం 1093 మంది ఓటర్లు ఉండగా 785 మంది ఓటు వేశారు. 72 శాతం పోలింగ్ నమోదైనట్లు తాసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. అర్వపల్లి మండలంలో మొత్తం 1302 ఓట్లు ఉండగా 914 మంది ఓటు వేశారు.

ప్రతీకారంతోనే యువకుడి హత్య

- యువకుడి హత్యకేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాహుల్ హెగ్డే

హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 27 : యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో కేసుకు సబంధించిన వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నందికొండ సైదులు కుమారుడు నందికొండ వెంకన్న (26) టేకుమట్లలో బంధువుల ఇంట్లో ఉంటూ సూర్యాపేటలోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం 8 గంటలకు తాను పని చేస్తున్న సంస్థకు వెళ్తున్నట్లు ఇట్లో చెప్పి బయల్దేరాడు. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకగా వెంకన్న బైక్ రాయిన్‌గూడెం గ్రామ శివారులోని రాజుగారి తోట ఎదురుగా జాతీయరహదారి పక్కన పడి ఉంది. చెప్పులు, జేబు రుమాలు కూడా అక్కడే పడి ఉండడంతో బంధువులు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం అతడి మృతదేహం మోతె మండలం రాఘవాపురం శివారులో పూర్తిగా కాలిపోయి కనిపించింది. పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను రప్పించి ఆధారాలు సేకరించి.. హత్య చేసిన నిందితులను గుర్తించారు.

పలు మార్లు రెక్కీ..

నందికొండ వెంకన్న 2022లో తన స్నేహితుడైన బెజవాడ రాజశేఖర్‌ను డబ్బుల పంచాయితీ విషయంలో హత్య చేయగా కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో జైలుకు వెళ్లిన వెంకన్న తర్వాత బెయిల్‌పై వచ్చి టేకుమట్ల గ్రామంలోని తన పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. బెజవాడ రాజశేఖర్ హత్యకు ప్రతీకారంగా నందికొండ వెంకన్నను చంపాలని రాజశేఖర్ అన్న బెజవాడ రమేశ్ నిర్ణయించుకున్నాడు. వెంకన్న స్నేహితుడు ఖమ్మంపాటి సైదులుతో కలిసి పలుమార్లు రెక్కీ నిర్వహించాడు. ఈ నెల 21న ఉదయం 7 గంటలకు రమేశ్, సైదులు యాక్టివాపై టేకుమట్లకు వచ్చి వెంకన్న ఎన్నిగంటలకు ఇంట్లోంచి వెళ్తున్నాడు, తిరిగి ఎన్ని గంటలకు ఇంటికి వస్తున్నాడనే విషయమై రెక్కీ నిర్వహించాడు. నందికొండ వెంకన్నను హత్య చేసేందుకు పథకం రూపొందించారు. అందుకు సహకరించాలని తన బాబాయి బెజవాడ జానయ్య, బోడ సతీశ్‌కుమార్, ఇస్లావత్ సురేశ్‌ను కోరగా వారు సరే అన్నారు. పథకంలో భాగంగా ఈ నెల 23న ఉదయం ఖమ్మంపాటి సైదులుకు చెందిన మహేంద్ర సుప్రో వాహనంలో బెజవాడ రమేశ్‌తో పాటు బోడ సతీశ్‌కుమార్, ఇస్లావత్ సురేశ్, బెజవాడ జానయ్య టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద ఆగారు. 8 గంటల సమయంలో నందికొండ వెంకన్న బైక్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా అతడిని ఫాలో అయ్యారు. రాజుగారి తోట వద్ద మహేంద్ర సుప్రో వాహనంతో వెంకన్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దాంతో రోడ్డు పక్కకు పడిపోయిన వెంకన్నను బలవంతంగా వాహనంలో ఎక్కించుకొని మోతె శివారులోకి తీసుకెళ్లి తాడుతో మెడకు ఉరివేసి హత్య చేశారు. అనంతరం కర్రలు మృతదేహంపై వేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రసూల్‌గూడేనికి చెందిన బెజవాడ రమేశ్‌తో పాటు మిగతా నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఈ కేసును ఛేదించిన సూర్యాపేట డీఎస్పీ జి.రవి, సీఐ వై.సురేందర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ ఎన్. బాలూనాయక్‌ను ఎస్పీ అభినందించారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

ధర్మారెడ్డిపల్లిలో ఈదురు గాలులకు పైకప్పు లేచిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే 27 : ఈదురుగాలులతో నష్టపోయిన బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో ఈదురు గాలుల బీభత్సంతో ఇంటి పైకప్పు లేచిపోయిన బాధితుల కుటుంబాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ముత్యాలమ్మ గుడి స్వాగత ఆర్చి, ధ్వంసమైన ఇంటి పైకప్పు రేకులు, తడిసిన ధాన్యాన్ని, జరిగిన ఆస్తి నష్టం వివరాలను గ్రామ ప్రజలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తన వంతు ఆర్థిక సాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, నాయకులు కొలుపుల అమరేందర్, జడల అమరేందర్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీ శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ సామ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రత్యేక సౌకర్యాలు

- డీఈఓ నారాయణరెడ్డి

రెడ్లరేపాక అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

వలిగొండ, మే 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నదని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రెడ్లరేపాక, పులిగిల్ల ప్రభుత్వ పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 40 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసిందని, వాటిల్లో విద్యార్థులకు రక్షిత మంచినీరు, మెరుగైన టాయిలెట్ సౌకర్యాలతోపాటు యూనిఫాం, పాఠశాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు అందజేస్తుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పాఠశాలల ప్రారంభంలోపు పూర్తి చేయాలని, విద్యార్థుల యూనిఫాం సిద్ధంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ సుంకోజు భాస్కర్, ప్రధానోపాధ్యాయులు గంగధారి భిక్షపతి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామన్నపేట, మే 27 : మండలంలోని మునిపంపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రవీందర్, వెంకటస్వామి, రఘువీర్, వెంకట్‌రెడ్డి, కవిత, శంభులింగం, సత్యంబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలన్నీ ఏకమై.. భారీ సర్పాన్ని తరిమాయి

నాగు పాము వెంట పడి తరుముతున్న కుక్కలు

రాజాపేట, మే 27 : పంట పొలాల్లో సంచరించే పాములను సాధారణంగా ముంగీసలు వెంట పడి కొరికి తరిమివేస్తాయి. కానీ.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని దూదివెంకటాపురం గ్రామ శివారులో గొడిసేల వెంకటేశం వ్యవసాయ బావి వద్ద సోమవారం అటుగా వెళ్తున్న భారీ నాగు పామును 5 కుక్కలు పసిగట్టాయి. నాగు పాము పడిగ విప్పి బుసలు కొడుతుండడంతో అన్నీ ఏకమై దాని వెంట పడి చెట్ల పొదల్లోకి తరిమాయి. ఈ దృశ్యాన్ని ఓ రైతు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- భర్త, బిడ్డకు తీవ్ర గాయాలు

భువనగిరి కలెక్టరేట్, మే 27 : ద్విచక్ర వాహనదారుడిని కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందింది. భర్త, బిడ్డకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అనాజిపురం బస్టాప్ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పచ్చర్లబోడుతండాకు చెందిన బానోతు బిక్కు, తన భార్య పద్మ (40), కుమార్తె శ్రీవిద్యతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం భువనగిరికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అనాజీపురం బస్టాప్ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన పద్మ (40) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త బిక్కు, కుమార్తె శ్రీవిద్యకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

పద్మ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలి

భువనగిరి కలెక్టరేట్, మే 27 : వివిధ రంగాల్లో ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు సిఫారసు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళారంగం, సామాజిక సేవ, ప్రజా సేవ, విజ్ఞానశాస్త్రం, ఇంజినీరింగ్, వ్యాపారం, పరిశ్రమలు, వైద్యశాస్త్రం, సాహిత్యం, విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో విశేష కృషి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు తాము చేసిన కార్యక్రమాలను 800 పదాలకు మించకుండా రాసి (www.padmaawards.gov.in) వెబ్‌సైట్‌లో నిర్ణీత దరఖాస్తును పూర్తి చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో 3 సెట్లను కలెక్టరేట్‌లోని రూమ్ నెం. ఎస్4, రెండో అంతస్తులో జూన్ 1వ తేదీలోపు అందించాలని సూచించారు.

కళాత్మకంగా పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు

భూదాన్ పోచంపల్లిలో ఇక్కత్ పట్టు చీరెలను పరిశీలిస్తున్న వివిధ రాష్ట్రాల అధికారుల బృందం

భూదాన్ పోచంపల్లి, మే 27 : పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో కళాత్మకంగా ఉన్నాయని వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది అధికారుల బృందం కొనియాడారు. పట్టణంలోని టూరిజం పార్కు, చేనేత సహకార సంఘం, చేనేత కార్మికుల గృహాన్ని సోమవారం వారు సందర్శించారు. చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి మగ్గాలపై తయారు చేస్తున్న వస్త్రాల తయారీని పరిశీలించారు. అనంతరం టూరిజం పార్కులో భూదానోద్యమానికి సంబంధించిన చిత్రాలను తిలకించారు. చేనేత సహకార సంఘంలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. ఇక్కత్ డిజైన్లను చూసి కార్మికుల కళా నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు. ఇక్కత్ వస్త్రాలు ఖండాంతర ఖ్యాతి చెందాయని చేనేత వారసత్వ కళా నైపుణ్యం అద్భుతం అని ప్రశంసించారు. ఈ బృందంలో మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, ఢిల్లీ, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధికారులు ఉన్నారు.

మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి హుండీ లెక్కింపు

మఠంపల్లి, మే 27 : మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం అధికారులు లెక్కించారు. 65 రోజులకు గానూ ప్రధాన హుండీ ద్వారా రూ.12,49,936, అన్నదానం హుండీ ద్వారా రూ.47,310, కల్యాణ కట్నాల ద్వారా రూ.3,55,340, మొత్తం రూ.16,52,586 ఆదాయం వచ్చినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సిరికొండ నవీన్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సొడమ్మ తల్లి జాతర

సూర్యాపేట రూరల్, మే 27 : మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఉన్న సొడమ్మతల్లి ఆలయంలో సోమవారం యాదవుల ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి సొడమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రమేశ్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గట్టు శ్రీనివాస్, ఎడ్ల వీరమల్లుయాదవ్, ధరావత్ వెంకన్ననాయక్, షఫీఉల్లా, దేవేందర్, యాదవ సంఘం నాయకులు జాల మాణిక్యంయాదవ్, జానయ్యయాదవ్, నాగయ్యయాదవ్, శంకర్‌యాదవ్, శ్రీను పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : సొడమ్మ జాతరలో పాల్గొన్న యాదవులు

పెన్‌పహాడ్ మండలంలో

పెన్‌పహాడ్, మే 27 : మండల కేంద్రంలో సోమవారం సొడమ్మ, లింగమంతుల స్వాముల జాతర ఘనంగా జరిగింది. మండల కేంద్రంతో పాటు మాచారం, పొట్లపహాడ్, సింగారెడ్డిపాలెం, అనంతారం గ్రామాలకు చెందిన యాదవులు గంపలతో తరలివచ్చారు. దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవుల భేరీ మోతలతో జాతర ప్రాంగణం మారు మోగింది.

రాములు పోరాట స్ఫూర్తి మరువలేనిది

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి కలెక్టరేట్, మే 27 : సీపీఐ మండల కార్యదర్శి ముదిగొండ రాములు పోరాట స్ఫూర్తి మరువలేనిదని, నేటి తరానికి ఆయన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పి మాట్లాడారు. రాములు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, నాయకులు బొలగాని సత్యనారాయణ, దామోదర్‌రెడ్డి, కృష్ణ, వెంకటేశ్, సుదర్శన్, ముత్యాలు, ఇమ్రాన్, బాబు, శ్రీధర్, సబిత, హేమలత, అభిలాశ్, శాంతికుమార్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల పరామర్శ

అనారోగ్యంతో మృతిచెందిన సీపీఐ మండల కార్యదర్శి ముదిగొండ రాములు అంత్యక్రియల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు కృష్ణ, వెంకటేశం, చంద్రయ్య పాల్గొన్నారు. రాములు కుటుంబ సభ్యులను ఓదార్చారు.